క్లుప్తంగా

ఆలయాల్లో కార్తిక సందడి


హోమంలో పాల్గొన్న భక్తులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక విశ్వనాథస్వామి దేవస్థానంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం వినాయకుడికి అత్యంత ప్రీతికరమైన అంగారక సంకష్టహర చతుర్థిని ఘనంగా నిర్వహించారు. లక్ష్మీ గణపతి హోమం జరిపారు. కొబ్బరి బొండ జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా భక్తులు శివుని, వెంకటస్వామి ఆలయాలను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఈవో ముక్తారవి, అర్చకులు నరహరిశర్మ, భట్టాచార్య, బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాండూర్: మండలంలోని మాదారం టౌన్‌షిప్‌లో మంగళవారం అంగారక చతుర్థి పూజలు వైభవంగా జరిగాయి. టౌన్‌షిప్ శివారులోని వృక్ష వరసిద్ధి వినాయకుడి వద్దకు భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వేద పండితుడు వినోద్, భక్తులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

చెన్నూర్: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు భోజనం అధ్వానంగా అందజేస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. జిల్లా అధికా రులు ఈ విషయంపై విచారణ జరిపి ఆ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ మల్లికార్జున్‌కు వినతిపత్రం అందజేశారు. రోగులకు నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రాంలాల్‌గిల్డా, మున్సిపల్ కౌన్సిలర్లు రెవెల్లి మహేశ్, జోడు శంకర్, నాయకులు పాల్గొన్నారు.

21న మినీ జాబ్‌మేళా

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో ఉపాధి కార్యాయలయంలో ఈ నెల 21న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదర్శ ఆటోమోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్, మంచిర్యాలలో 8 రిలేషన్‌షిప్, 2సీనియర్ రిలేషన్‌షిప్ మేనేజర్, 2 ట్రూ వాల్యూ డిపార్ట్‌మెంట్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు 20నుంచి 32సంవత్సరాల వయసు, డిగ్రీ పూర్తి చేసి ఉండాలని, టూ వీలర్, ఫోర్ వీలర్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. తమ బయోడేటా, ధృవపత్రాల జిరాక్స్ పత్రాలతో జాబ్‌మేళాకు ఉదయం 10.30గంటలకు హాజరు కావాలన్నారు. వివరాలకు 81210 09065, 91103 68501నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

దుర్వాసనతో అవస్థలు..!

- డ్రెయినేజీలు లేక రోడ్లపై పారుతున్న మురుగునీరు
- ప్రయాణికులు, వాహనదారుల ఇబ్బందులు
- అధికారులకు విన్నవించినా పట్టించుకోని వైనం
- సమస్య పరిష్కరించాలని ప్రజల వేడుకోలు



కోటపల్లి: ఎర్రాయిపేటలో రహదారిపై పారుతున్న మురుగు

లక్సెట్టిపేట/భీమారం/కోటపల్లి: లక్సెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలో పదిహేను వార్డులున్నాయి. చాలా వార్డుల్లో రోడ్ల పక్కన డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపై పారుతోంది. ప్రయాణికులు దుర్వాసనతో నానా అవస్థలు పడుతున్నారు. లక్సెట్టిపేట గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయి నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా, ఇప్పటికీ అంతర్గత రోడ్లు, మురుగు కాలువలు లేకపోవడంతో పట్టణంలో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పన్నులు వసూలు చేస్తున్నారు కానీ.. వసతులు కల్పించడం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదాయం అధికంగా ఉన్నా సౌకర్యాలు కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమయ్యారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

- భీమారం మండల కేంద్రంలోని పాత బ్యాంకు వాడలో డ్రెయినేజీ లేకపోవడంతో మురుగునీరు రోడ్డెక్కి ప్రవహిస్తున్నాయి. హైస్కూల్ ఏరియా నుంచి వచ్చే మురుగు నీరు కాలువలకు వెళ్లాల్సి కొన్ని చోట్ల డ్రెయినేజీలు ఏర్పాటు చేయకపోవడంతో రోడ్లపై పారుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సమస్య పరిష్కరించాలని, డ్రెయినేజీలు నిర్మించాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు గాని, ప్రజాప్రతినిధులు గాని స్పందించి డ్రెయినేజీల ఏర్పాటుకు కృషి చేయాలని కోరుతున్నారు.
- కోటపల్లి మండలంలోని ఎర్రాయిపేట, లింగన్నపేట, బొప్పారం గ్రామాల్లో రోడ్లపైనే మురుగునీరు ప్రవహించి వాహనదారులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయినేజీ కాలువలు లేక మురుగునీరు రోడ్లపైకి వచ్చి కంపు కొడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు.

డ్రెయినేజీలు నిర్మించేందుకు కృషి

మున్సిపాలిటీ పరిధిలో కొన్ని ప్రదేశాల్లో డ్రెయినేజీలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని వార్డుల్లో డ్రెయినేజీలు నిర్మించాం. మరికొన్ని వార్డుల్లో నిర్మించేందుకు నిధులు లేకపోవడంతో నిర్మించలేదు. త్వరలోనే నిర్మిస్తాం.

– కల్లెడ రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్, లక్సెట్టిపేట

ప్రతిపాదనలు పంపిస్తాం..

భీమారంలోని పాత బ్యాంక్ వీధిలో డ్రెయినేజీ లేని మాట వాస్తవం. ప్రజలు నా దృష్టికి తీసుకొచ్చారు. మురుగు కాలువ నిర్మించడానికి ప్రతిపాధనలు పంపిస్తాం. మంజూరు కాగానే డ్రెయినేజీ నిర్మాణానికి కృషి చేస్తాం.

– సతీష్ రెడ్డి, ఎంపీవో, భీమారం

చర్యలు తీసుకుంటాం

మురుగు నీరు రోడ్లపై పారుతున్న విషయం నా దృష్టికి వచ్చింది. నిధులు లేకపోవడంతో డ్రెయినేజీల నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. ఉన్నతాధికారులకు సమస్యను విన్నవించి పరిష్కారానికి కృషి చేస్తాం. మురుగు నీరు రోడ్లపై నిలవకుండా త్వరలోనే చర్యలు తీసుకుంటాం.

– సత్యనారాయణ, ఎంపీవో, కోటపల్లి


కోటపల్లి: లింగన్నపేటలో రోడ్డు పక్కన డ్రెయినేజీ కంపు


ఆంధ్రాకాలనీ ఏడో వార్డులో రోడ్డుపై పారుతున్న మురుగునీరు


భీమారం పాత బ్యాంకు వాడలో రోడ్డెక్కిన మురుగు నీరు

ఆకట్టుకున్న రంగవల్లులు


ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

మంచిర్యాలఅర్బన్: జిల్లా గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. వివిధ ఆకృతుల్లో వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో 8మందిని విజేతలుగా ప్రకటించారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

సేవాలాల్ సేనా జిల్లా కార్యవర్గం ఏర్పాటు

భీమారం: సేవాలాల్ సేనా జిల్లా కార్యవర్గాన్ని మంగళవారం భీమారం మండలం బూర్గుపల్లిలో జిల్లా నాయకులు గుగ్లోత్ మల్లేశ్ నాయక్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బుక్యా లక్ష్మణ్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా దరావత్ శంకర్ నాయక్, అజ్మీర రాజేష్‌నాయక్ ఎన్నికయ్యారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి 'లోకల్ కోర్ట్'

రామకృష్ణాపూర్/మందమర్రిరూరల్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం క్యాతనపల్లిలోని 33 కే వీ సబ్‌స్టేషన్లో లోకల్ కోర్టు నిర్వహిస్తున్నట్లు టీజీఎన్‌పీడీసీఎల్ డీఈ కై సార్, ఏడీఈ మోహన్‌రెడ్డి, మందమర్రి విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీనివాస్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాలరూరల్ సబ్ డివిజన్ పరిధిలోని నస్పూర్, మందమర్రి, క్యాతనపల్లి, హాజీపూర్ మండలాల విద్యుత్ వినియోగదారులు లోకల్‌కోర్టుకు హాజరై తమ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు లోకల్ కోర్టు నిర్వహించనున్నట్లు, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆక్రమణల వెలికితీతకు శ్రీకారం

- శివారుల హద్దులకు కొలతలు


హద్దులు గుర్తిస్తున్న అధికారులు

వేమనపల్లి: మండలంలోని దస్నాపూర్ శివారులో నిర్మించిన వేమనపల్లి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం ఆక్రమణలు వెలికితీయడానికి అధికారులు శ్రీకారం చుట్టారు. ఫిర్యాదు చేసిన ఐదు నెలలకు మంగళవారం కొలతలకు వచ్చారు. జిల్లా ఏడీఎస్‌ఎల్‌ఆర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కొలతలు చేశారు. గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల వేమనపల్లి, కొత్తపల్లి, దస్నాపూర్ సరిహద్దును ఆనుకొని ఉండటం మూలంగా స్పష్టత కోసం మూడు శివారుల హద్దులను కొలతలు చేశారు. త్వరలో ఆశ్రమ పాఠశాల చుట్టూ ఉన్న పట్టాదారులకు నోటీసులిచ్చి మళ్లీ కొలతలు చేపడతామని ఏడీ గ్రామస్తులకు సూచించారు. దీంతో మళ్లీ ఆక్రమణల తొలగింపు సమస్య మొదటికి వచ్చినట్లేనని గ్రామస్తులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. దస్నాపూర్ శివారులో ఉన్న పెద్ద చెరువు శిఖం భూమి 30ఎకరాలు కబ్జాకు గురైందని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని గ్రామస్తులు సర్వేకు వచ్చిన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంసీ దశరథ్‌లు చెరువు మత్తడి వద్దకు వెళ్లి పరిస్థితిని గమనించారు. పంట కోతలు పూర్తయ్యే వరకు కబ్జాదారులందరికీ నోటీసులిచ్చి కొలతలు చేస్తామని హామీ ఇచ్చారు.

'ఆంక్షలు ఎత్తివేయాలి'

మంచిర్యాలఅర్బన్: సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్టీసీలో కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మంచిర్యాల డిపో ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్‌కుమార్, నవీన్‌కుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

'గడ్డిని కాల్చొద్దు'

భీమారం: వరి పంట కోతల అనంతరం గడ్డిని కాల్చితే భూసారం దెబ్బతింటుందని ఏవో సుధాకర్ తెలిపారు. రైతువేదికలో వరిగడ్డి కొయ్య కాలులను కాల్చడం వల్ల జరిగే నష్టాలపై మంగళవారం రైతులకు వివరించారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

పాతమంచిర్యాల/భీమిని: కన్నెపల్లి మండలంలోని రెబ్బెన గ్రామ పంచాయతీలోని వృద్ధులకు, వితంతువులకు బెల్లంపల్లి తిలక్ గ్రౌండ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఏరియాలో ప్రజావెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పేద ప్రజలకు మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు.

జోనల్ మీట్‌లో విద్యార్థుల ప్రతిభ

బెల్లంపల్లి: ములుగు జిల్లా జాకారం ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల/కళాశాలలో ఇటీవల జరిగిన జోనల్ స్థాయి గేమ్స్, స్పోర్ట్స్ మీట్‌లో బెల్లంపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీవోఈ) విద్యార్థులు ప్రతిభ చాటారు. పతకాలు సాధించిన క్రీడాకారులను మంగళవారం సీవోఈలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అభినందించారు. అథ్లెటిక్స్‌లో 500మీటర్ల విభాగంలో సీ.హెచ్.అరవింద్ బంగారు పతకం, 800మీటర్ల పోటీల్లో సిల్వర్ మెడల్ గెలుచుకున్నాడు. 1500మీటర్ల క్రీడా పోటీల్లో ఎం.హర్షిత్ సిల్వర్ మెడల్, 5000మీటర్ల పోటీల్లో కె.రాకేష్ బ్రాంజ్ మెడల్ గెలిచాడు. హైజంప్‌లో కె.బీమ్‌రావ్ సిల్వర్ మెడల్, షాట్‌ఫుట్ పోటీల్లో ఎం.అభినవ్ బ్రాంజ్ మెడల్ సాధించాడు. అండర్–19 విభాగంలో జరిగిన అథ్లెటిక్స్ 1500మీటర్లు, 5000 మీటర్ల పోటీల్లో ఆర్.వివేక్ వర్ధన్ బ్రాంజ్ మెడల్ గెలుచుకున్నాడు. అండర్–14విభాగంలో జరిగిన చెస్ పోటీల్లో డి.రుత్విక్ తేజ రన్నర్స్‌గా నిలిచాడు. అండర్–19విభాగంలో జరిగిన క్యారమ్స్ పోటీల్లో ఎం.వెంకటేష్, గిరిధర్ ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. పీఈటీలు వామన్, రాజశేఖర్‌లను సీవోఈ ప్రిన్సిపాల్ డి.శ్రీధర్ అభినందించారు.


క్రీడాకారులు, ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే

క్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్యే

బెల్లంపల్లి: కాళేశ్వరం జోనల్ మీట్ క్రీడా పోటీల్లో సత్తా చాటి పతకాలు సాధించిన బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కాసిపేట బాలుర గురుకుల విద్యార్థులను ఏఎంసీ ఏరియాలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే గడ్డం వినోద్ అభినందించారు. క్రీడా పోటీల్లో సాధించిన పతకాలను ఎమ్మెల్యే ముందు ప్రదర్శించారు. క్రీడలపై ప్రతి ఒక్కరూ ఆసక్తి చూపాలని ఎమ్మెల్యే సూచించారు. విద్యార్థులు క్రీడల్లో రాణించడానికి ప్రోత్సహిస్తున్న ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్, పీడీ హరీష్, పీఈటీ రాజేందర్‌లను ఎమ్మెల్యే ప్రశంసించారు. కార్యక్రమంలో కాసిపేట సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


దండేపల్లి: నివాళులర్పిస్తున్న నాయకులు


లక్సెట్టిపేటలో..


మంచిర్యాలటౌన్: నివాళులర్పిస్తూ...

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి

దండేపల్లి/లక్సెట్టిపేట/చెన్నూర్/మంచిర్యాలటౌన్/రామకృష్ణాపూర్/కాసిపేట/పాతమంచిర్యాల/మంచిర్యాలరూరల్(హాజీపూర్): భారత మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ జయంతిని జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో...


కాసిపేట: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


రామకృష్ణాపూర్: నివాళులర్పిస్తున్న నాయకులు

పక్కా ప్రణాళికలతోనే లక్ష్య సాధన

- జీఎం(కోఆర్డినేషన్) సుభాని


అధికారులతో మాట్లాడుతున్న జీఎం సుభాని

శ్రీరాంపూర్: పక్కా ప్రణాళికలతోనే నిర్దిష్ట లక్ష్యాలు సాధించవచ్చని సింగరేణి జీఎం(కోఆర్డినేషన్) సుభాని తెలిపారు. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్టు గనిని సోమవారం ఆయన సందర్శించారు. ఓసీపీ పీవో, ఇన్‌చార్జి ఏరియా జీఎం శ్రీనివాస్‌తో కలిసి వ్యూపాయింట్ నుంచి క్వారీని పరిశీలించారు. అనంతరం బొగ్గు ఉత్పత్తిపై ఏజెంట్లతో సమీక్ష నిర్వహించారు. నెల వారి లక్ష్యాలను సాధిస్తూ లోటు ఉత్పత్తిని భర్తీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటుజీఎం సత్యనారాయణ, ఏజెంట్లుఎ వెంకటేశ్వర్‌రావు, కుర్మ రాజేందర్, ఇందారం ఓసీపీ పీవో ఏవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు నాణ్యత పెంచాలి


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ఉద్యోగులు

శ్రీరాంపూర్: బొగ్గు నాణ్యత పెంచాలని శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్ తెలిపారు. ఓసీపీపై మంగళవారం బొగ్గు నాణ్యత వారోత్సవాలు నిర్వహించారు. ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించి మాట్లాడారు. బొగ్గు నాణ్యత ప్రమాణాలను పాటించాలన్నారు. ఉద్యోగులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో క్వాలిటీ ఇన్‌చార్జి కమ్రుద్దీన్, ఏఐటీయూసీ నాయకులు రాచర్ల చంద్రమోహన్, పిట్ సెక్రెటరీ మోతె లచ్చన్న, అధికారులు శ్యాంసుందర్, శంకర్ పాల్గొన్నారు.

సంతకాల సేకరణ

బెల్లంపల్లి/కాసిపేట: బొగ్గు గనుల ప్రైవేటీకరణను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సీపీఎం బెల్లంపల్లి ఏరియా కార్యదర్శి అశోక్ అన్నారు. బెల్లంపల్లి మండలం మాలగురిజాలలో, మందమర్రి ఏరియా కాసిపేట గనిపై మంగళవారం బొగ్గు గనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గ్రామస్తులతో సంతకాల సేకరణ చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కమిటీ సభ్యులు దూలం శ్రీనివాస్, నాయకులు గోమాస బాపు, కోడి కిష్టయ్య, మనోహర్, డోంగ్రి లక్ష్మణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ కుట్రలను కార్మికులు తిప్పి కొట్టాలి'

బెల్లంపల్లి: రైల్వే కార్మిక సంఘాల ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని దక్షిణమధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజనల్ అసిస్టెంట్ సెక్రెటరీ చిలుకు స్వామి కోరారు. బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లోని పలు విభాగాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం రైల్వేను ప్రైవేట్‌పరం చేయడానికి కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. ఆ కుట్రలను కార్మికులు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. డిసెంబర్ 4, 5 తేదీల్లో జరిగే రైల్వే కార్మిక సంఘాల ఎన్నికల్లో కార్మికులు తప్పక మజ్దూర్ యూనియన్‌ను బలపర్చి అధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం బెల్లంపల్లి బ్రాంచ్ చైర్మన్ నాగరాజు, సెక్రెటరీ సాంబశివుడు, నాయకులు వెంకటేష్, మురళీ, వనపర్తి మురళీ, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

'ఎన్నికల హామీలు నెరవేరుస్తాం'

మందమర్రిరూరల్: గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో కార్మికులకిచ్చిన హామీలను త్వరలోనే నెరవేరుస్తామని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం (ఏఐటీయూసీ) మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. ఏరియాలోని వర్క్‌షాపు ఆవరణలో మంగళవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. యాజమాన్యంతో సమస్యలపై చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు సుదర్శన్, శర్మ, తిరుపతి తదితరులు ఉన్నారు.

మెడికల్ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో రిటైర్డ్ అయిన, మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన ఉద్యోగులు తమ మెడికల్ కార్డు(సీపీఆర్‌ఎంఎస్) పొందడానికి మూడు నెలల్లోగా సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఏరియా డీజీఎం(పర్సనల్)అరవిందరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గర్మీ కోట్లు ఇవ్వాలి

శ్రీరాంపూర్: సర్ఫేస్ విభాగంలో పనిచేసే కార్మికులకు గర్మీకోట్లు ఇవ్వాలని సీఐటీయూ బ్రాంచీ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, నాయకులు వెంగళ శ్రీనివాస్, కస్తూరి చంద్రశేఖర్, తోడె సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

హిందువులు ఐక్యంగా ఉండాలి


జైపూర్: మాట్లాడుతున్న సురేశ్ ఆత్మారాం మహారాజ్

జైపూర్: హిందువులు ఐక్యంగా ఉంటూ సనాతన ధర్మాన్ని కాపాడుతూ ఆలయాలను పరిరక్షించుకోవాలని చిలుకూరి బాలాజీ శివాలయం అర్చకులు సురేశ్ ఆత్మారాం మహారాజ్ తెలిపారు. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని వేలాల గట్టు మల్లన్న స్వామి గుట్టపై మంగళవారం డప్పుసప్పుళ్ల మధ్య వైభవోపేతంగా గిరిప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్ రావు, ఆలయ ఈవో రమేశ్, స్థానిక నాయకులు, పరిసరప్రాంత భక్తులు పాల్గొన్నారు.

హిందూ సంస్కృతిని కాపాడాలి

చెన్నూర్: ప్రతి హిందువు హిందూ సంస్కృతిని కాపాడాలని తెలంగాణ సహ ప్రాంత ప్రచార ప్రభుకుమార్ అన్నారు. స్వయం సేవక్ సంఘ్ శాఖ ప్రారంభించి 100ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో చెన్నూర్ పురవీధుల్లో పథ సంచలన నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు లట్టి రాజబాపు, కొల్లూరి శంకర్, లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మందమర్రిరూరల్: కాగజ్‌నగర్‌లో డ్రంకెన్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జ్ఞానిక(వెండి), శ్రేష్ట (వెండి), కార్తికేయన్ (కాంస్య), మణిదీప్(కాంస్య) పతకాలు సాధించగా మంగళవారం ప్రిన్సిపాల్ శారా తస్నీమ్, కరాటే మాస్టర్ రంగు శ్రీనివాస్ అభినందించారు.

వాలీబాల్ పోటీలకు ఎంపిక

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాద గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న ఎం.నక్షత్ర అండర్ 14 జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యింది. ఈ సందర్భంగా మంగళవారం డీఈవో యాదయ్య, హెచ్‌ఈఎఫ్ సెక్రటరీ రాజా, తదితరులు ఆమెను ఆశీర్వదించారు.

ఎందుకు తవ్వారు.. ఎందుకు పూడ్చారు?



మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలోని మార్కెట్ రోడ్డులో టెండర్లు నిర్వహించకుండానే డ్రెయినేజీ పనులు చేపట్టేందుకు ఈ నెల 10వ తేదీన మున్సిపల్ అధికారులు తవ్వకాలు చేపట్టారు. గతంలో రూ.5లక్షల నిధులను డ్రెయినేజీ కోసం కేటాయించామని మున్సిపల్ అధికారులు చెప్పి, డీపీఆర్ లేకుండా, టెండర్లను నిర్వహించకుండానే తవ్వకాలు చేపట్టారు. నాటి నుంచి ఎలాంటి పనులు చేయకపోగా, రోజుల తరబడి కందకాన్ని అలాగే వదిలేయడంతో వ్యాపారస్తులు ఇబ్బంది పడ్డారు. రోడ్లను ఆక్రమించి కట్టిన కట్టడాల తొలగింపులో ఓ భవన యజమాని కోర్టుకు వెళ్లారని, డ్రెయినేజీ నిర్మాణం పేరిట కందకం తవ్వినట్లుగా ఆరోపణలు వచ్చాయి. కోర్టుకు వెళ్లిన వ్యక్తితో రాజీ కుదరడం వల్లనే కందకాన్ని రాత్రికి రాత్రే పూడ్చివేసినట్లుగా పట్టణంలో చర్చసాగుతోంది.